గాఢ ప్రశాంతి, పరమానందానుభూతి తప్పక కలుగగలవు. ఇట్టి పరమసత్యములను జ్ఞాపకము చేసికొనుచు, స్వస్వరూపానుభవ మను పరమలక్ష్యమును సాధించుటకై సాధనను, తీవ్రతర ప్రతిజ్ఞలను గావించుకొనవలసిన శుభసమయమే ఈ మౌక్తికోత్సవ సందర్భము.

పరమ పవిత్రమగు ఈ మౌక్తికోత్సవ శుభసమయమున జను లీ క్రింది వాక్యములను బాగుగ జ్ఞాపకము చేసికొనవలసియున్నది.

1. తాను ఆత్మయేకాని దేహము కాదు. తనకు త్రికాలమందును వినాశములేదు. నశించునది, వికారము నొందునది, మరణించునది దేహమే కాని దేహియగు తాను కాదు – ఓం ఓం ఓమ్ – ఈ ప్రకారముగ తనయొక్క 'సత్' అంశమును మాటిమాటికి మననము చేయుచుండవలెను.

2. తాను జడమగు ఒకానొక మట్టిబొమ్మ కాదు, మృణ్మయుడుకాదు, చిన్మయుడు. ప్రజ్ఞానఘనస్వరూపుడు. సుషుప్తియందును మేలుకొనియుండు చిద్రూపాత్మయే తాను - ఓం ఓం ఓమ్ – ఈ ప్రకారముగ 'చిత్' అంశమును మఱల మఱల చింతన చేయుచుండవలెను.

3. తాను సంసార దుఃఖములందుపడి క్రుంగిపోవు కీటకము కాదు. ఆనందసాగరమున నోలలాడు బ్రహ్మాండాధిపతి. నిప్పును చెదలు అంటజాలనట్లు దుఃఖశోకము లెవ్వియు తన్ను స్పృశింపజాలవు. ఓం ఓం ఓమ్ – ఈ ప్రకారముగా తనయొక్క 'ఆనందాంశమును' మాటిమాటికి మననము చేయుచుండవలెను.

ఈ రీతిగా తాను 'సత్-చిత్-ఆనందరూపుడగు పరమాత్మయే, యను పరమసత్యమును ప్రతిదినము పెక్కుసార్లు జ్ఞాపకము చేసుకొనవలయును.

"తద్బ్రహ్మా నిష్కళమహం న చ భూతసంఘః" 'నిష్కళమగు ఆ పరబ్రహ్మమే తానుగాని పంచభూతసముదాయమగు దేహము గాదు' అని శ్రీ శంకరభగవత్పాదు లానతిచ్చినట్లు ప్రతిజీవియు తన నిజరూపమును దినమునకు ఎన్నియో పర్యాయములు స్మృతిపథమునకు దెచ్చుకొనుచుండవలెను. తాను దరిద్రుడు కాదనియు, సమ్రాట్టనియు, మహాచక్రవర్తి యనియు, విశ్వసామ్రాజ్యాధిపతి యనియు భావించవలెను.

'యద్భావం తద్భవతి' – తానెట్లు భావించునో అట్లే యగును. కావున ప్రాతఃకాలము నిద్రలేచినది మొదలు మరల పరుండువరకును వ్యవహారమధ్యమున

గూడ ఇట్టి మహోన్నత గంభీర భావములనే పలుసార్లు జ్ఞప్తికి తెచ్చుకొనుచుండవలెను. అట్లు జ్ఞాపకము చేసుకొనునప్పుడు 'ఓం ఓం ఓమ్' అని ప్రణవమును గూడ స్మరించుట ప్రారంభమున చాల సహాయకారిగా నుండగలదు.

మరియు వారివారి సంస్కారము ననుసరించి కర్మమార్గమును గాని, భక్తిమార్గమును గాని, ధ్యానమార్గమునుగాని, జ్ఞానమార్గమునుగాని చేపట్టి వైరాగ్యమును, సర్వభూతదయను అన్ని మార్గములకు తోడుగ దీసుకొని అధ్యాత్మపథమున అగ్రసరుడై జీవు డచిరకాలములో ఆత్మసాక్షాత్కారరూప పరమలక్ష్యమును ఈ జీవితమునందే సాధించివైచి కృతార్థుడు కావలెను.

కరుణామయుడగు సర్వేశ్వరుని పరిపూర్ణానుగ్రహముచే జనులలో ఆధ్యాత్మిక ప్రవృత్తి పెంపొంది లక్ష్యప్రాప్తికై ద్విగుణీ కృతప్రయత్నము సంభవించుగాక!!!"

(వేదాంతభేరి - మార్చి - 1963)

దివ్యజీవన సంఘ స్థాపకులు శ్రీ స్వామి శివానంద సరస్వతీమహరాజ్‌గారు, చిన్మయ మిషన్ వ్యవస్థాపకులు శ్రీ చిన్మయానందస్వాములవారు మొదలైన మహనీయులు పంపిన సందేశాలు మౌక్తికోత్సవసభలో సముపస్థితులైన భక్తవర్గానికి, సాధకలోకానికి ఎనలేని ఉత్సాహం కలిగించాయి. శాంతిమంత్ర పఠనంతో మౌక్తికోత్సవకార్యక్రమం శుభప్రదంగా సమాప్త మయింది.

గీతామకరంద ప్రశస్తి

గీతామకరందం ఆవిష్కరణ మౌక్తికోత్సవ సందర్భంలోనే జరిగిందని చెప్పుకొన్నాం. శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి యశోగరిమను నలుదిక్కులా వ్యాపింపజేయడంలో ఈ గ్రంథరాజం నిర్వహించిన పాత్ర చాలా విశిష్టమైనది. వెయ్యిన్ని నూరు పుటలకు పైగా విస్తరించిన ఈ పుస్తకం సాటిలేని ప్రచారం పొందింది. మూలశ్లోకాలకు ప్రతిపదార్థమూ, తాత్పర్యమూ, విపుల వ్యాఖ్యానమూ ఇందులో సమకూర్చబడ్డాయి. ఎడనెడా సామాన్యపాఠకులను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నోత్తర రూపంలో అనేక ఆధ్యాత్మిక విషయాలు గ్రంథానికి అనుబంధంగా చర్చించబడ్డాయి. స్కాందపురాణం, వైష్ణవీయతంత్రసారం, మహాభారతం, వరాహపురాణం మొదలైన గ్రంథాలలో గీతాప్రభావాన్ని ప్రతిపాదించే విషయాలుకూడా క్రోడీకరించబడ్డాయి. మంత్రరూపమైన గీతను ఎలా జపించాలి?

ఏ విధంగా పారాయణం చేయాలి? అందువల్ల కలిగే లౌకిక - పారమార్థిక ఫలితాలు ఎట్టివి? ఇత్యాది విషయాలను కూడా కూలంకషంగా ఇందులో శ్రీ స్వాములవారు నిరూపించారు. అధ్యాయక్రమంగా గీతాపారాయణఫలాన్ని వివరించే పద్మపురాణాంతర్గతకథలు కూడా ఇందులో ఉల్లేఖింపబడ్డాయి.

అంతేకాదు. శ్రీ స్వాములవారు ఈ గ్రంథానికి చాలా విపులమైన ఉపోద్ఘాతం వ్రాశారు. అందులో గీతాస్వరూపాన్ని, గీతాతత్త్వాన్ని వివిధ దృక్కోణాలతో సుదీర్ఘంగా వర్ణించారు.

గీతకు తెలుగులో ఈ గ్రంథం ఆవిర్భవించకముందే ఎన్నో వ్యాఖ్యలు వెలువడ్డాయి. అయినా ఈ గ్రంథం పై వ్యాఖ్యాగ్రంథాల కన్నింటికీ తలమానికంగా రూపొందింది. ఇంత బృహద్గ్రంథమైకూడా ఇప్పటి కిది లక్షయాభై వేల ప్రతులకు పైగా ప్రచారం కావడంలోనే దీని ప్రశస్తి ఎట్టిదో తెల్ల మవుతున్నది.

కొందరు భక్తులు స్వాములవారిని 'గీతామకరంద స్వాములవారు' అని కూడా వ్యవహరించడం కద్దు. దీనిని బట్టి ఈ గ్రంథానికీ, స్వాములవారికీ ఎంత అవినాభావ సంబంధం ఏర్పడిందో ఊహించుకోవచ్చు.

1963లో అనేక ప్రసిద్ధ పత్రికలు ఈ గ్రంథంపై సమీక్షలు ప్రకటించాయి. అందులో కొన్ని సమీక్షాంశాలను ఇక్కడ పొందుపరచడం ఎంతైనా సముచితం.

గీతామకరందంపై సమీక్షలు

"........ నిత్య స్మరణీయములగు కొన్ని గీతావాక్యములు, గీత యందలి ఉపమానములు, ఉపనిషత్తులలోని గీతావాక్యములు – ఒక్కటన నేల? వివిధ దృక్కోణములలో గీతను పరిశీలించి మృదుమధుర వచన రచనతో పాఠకులకు శ్రీ స్వాములవా రందించిన ఈ మకరందమును గ్రోల ఏ మానవబంభరము నిరసించెదు? పదబంధముల బాధ లేదు. ప్రసన్నమైన రచన. నిరాడంబరమైన శైలి. గ్రంథము చూడ ముచ్చట గొల్పుచున్నది. అప్రకృత విషయ వర్ణనాడంబరముగాని, పారిభాషిక పదగుంఫనముగాని లేక సర్వజన సంవేద్య మగునట్లు విషయము వ్రాసినారు శ్రీ స్వామి ...."

(ఆంధ్రపత్రిక - 23-6-1963)

"........ వ్యాఖ్యలైతే ఎన్నో వున్నాయిగాని ఏవీ అంత అందమైన ఆకా

రంలో లేవు. ఆ లోటును గీతామకరందం తీర్చింది. ఇది గీతయందు ఆసక్తిని గలుగజేస్తోంది. చక్కని ఆకర్షణీయమైన వ్యాఖ్య, విపులమైన తాత్పర్యం, ఎంతో జ్ఞానదాయకమైన ఉపోద్ఘాతమూ ఈ పుస్తకానికి అమూల్యతను కల్గిస్తున్నవి. గీతా మకరందమును చదువుతూ వుంటే ఇంకా ఇంకా చదువుకుంటూ పోవాలనే ఉంటుందికాని ఆపివేయాలని ఉండదు. వివరణ బాగుంటుంది, భాష బాగుంటుంది. .... . పాఠకునితో ఎంతో సన్నిహితత్వాన్ని ఇట్టే అలవరచుకుంటారు స్వాములవారు. మతవిషయకమైన వేయి పేజీల గ్రంథంలో ఈ గుణం మరీ మరీ కనిపించడం ఎంతో మెచ్చదగినది."

(ఆంధ్రజ్యోతి - 14-4-1963)

"వ్యాఖ్యాన నైపుణీవిశేషము శ్రీ స్వాములవారికి పూర్ణముగా గలదు. గీతా ప్రతిభ పాఠకుని హృదయమందిరమున శాశ్వతముగ నిలువునట్లు చతురోక్తులలో గ్రంథరచన సాగినది. తాత్పర్య రచనయు ఉదాత్త శైలిలో గీతామాహాత్మ్యా దయు గాంభీర్యమును ద్యోతక మొనరించుచున్నది. శ్రీ స్వామివారికి గీతపట్ల గల అపూర్వ భక్తిప్రపత్తులకు, వారికి గల లోతైన వేదాంత విజ్ఞానమునకు, తత్త్వసుధామథన నిర్వర్తనకు గీతామకరందం సాక్ష్యం."

(ఆంధ్రప్రభ - 11-8-1963)

"మతాచార్యులందరు కలిసి ఉమ్మడిగా ఒకే దివ్యపాత్రలో ఆ మకరందమును మరల ఆధునికాంధ్రప్రజానీకమునకు అందించిరో అన పూజ్య శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఒక బృహత్కాంచన పాత్రలో గీతామకరందమును అందించినారు. గీతామకరందమునకు తగిన పరిశుద్ధపాత్ర, పాత్ర నందించుటకు తగిన పరిశుద్ధ పురుషులు – ఈ సంఘటన మెంత అదృష్ట విశేషము! పాత్ర అశుద్ధముగా నున్నను, ఇచ్చువారు అపరిశుభ్రముగా నున్నను పదార్థము స్వీకరించుట కంతగా రుచింపదు. గీత, గీతను వ్యాఖ్యానించుటకు తగిన యోగ్యత, ఆ యోగ్యత ననుసరించిన రచనా వైదుష్యము – ఈ మూడు ఇచ్చట ముడిపడుకొన్నవి. ఈ ఉద్గ్రంథము సరస్వతీదేవి అక్షమాలలో వినూత్నముగా గూర్చబడిన ఒక మణిపూస".

(రామదర్శనం)

"శ్రీ స్వాములవారియొక్క దీర్ఘకాల పరిశ్రమ ఫలితమే ఈ గ్రంథ రాజము.

గీతకు సంబంధించిన వివిధ విషయములు ఇందు పొందుపరుపబడినవి. గీతాను రాగులకు, గీతాతత్త్వాన్వేషకులకు ఇయ్యది విశ్వకోశము వంటిది. . . . గీతావ్యాఖ్యయును తియ్యటి నూతన శోభను చేకూర్చుచున్నదనుటలో అతిశయోక్తి లేదు. . . . . . గీతాతత్త్వజిజ్ఞాసులకు ఇయ్యది అవశ్యపాఠేయము."

(యువభారతి - 15-3-1963)

"*Many Commentaries on Gita have been published so far in Telugu, but this work is significant in several ways. In an elaborate preface running into about 100 pages, the author has very beautifully explained the greatness of Gita and the value of the study in the Worldly life . . . . . After this the commentary of the author follows. It is here the author has exhibited his original thinking and experience.*

The Swamiji is not a mere Scholar with much of book-knowledge. His writings reveal that he has realised and experienced what he writes. Thus personal touch makes the work all the more valuable and immpressive. The Swamiji really deserves the gratitude of Telugu speaking Asthikas for his pious and learned labour of love. It is indeed difficult to spot light the manifold excellences of this book in a short review. The printing and get up leave nothing to be desired."

(Bhavan's Journal 24-11-63)

"తెలుగులో గీతకు ఇంతకుముందు ఎన్నో వ్యాఖ్యలు వెలువడ్డాయి. కాని అనేక విధాల ఈ వ్యాఖ్య విశిష్టమైనది. ఇంచుమించు నూరు పుటలకు విస్తరించిన ఉపోద్ఘాతంలో రచయిత గీత గొప్పతనాన్నీ, దాని అధ్యయనంవల్ల లౌకిక జీవితంలో జరిగే ప్రయోజనాన్నీ చాలా చక్కగా వివరించారు. .. . . దీని తర్వాత గ్రంథకర్త రచించిన వ్యాఖ్య వున్నది. వారు ఈ వ్యాఖ్యలో తమ సొంత ఆలోచనా, అనుభవాన్నీ ప్రదర్శించారు.

స్వామీజీ బహు గ్రంథ పరిచయం కల పండితులు మాత్రమే కాదు. వారు వ్రాసే విషయాలు వారు అనుభవపూర్వకంగా తెలుసుకొన్నవే అని వారి రచన వ్యక్తం చేస్తున్నది. వ్యక్తిగతానుభవం ఈ గ్రంథాన్ని ఎక్కువ విలువగలదిగాను,

ఆకర్షకంగానూ చేస్తున్నది. స్వాములవారి ఉదాత్తమైన ఈ ధార్మిక కృషికి ఆస్తికులైన తెలుగువారంతా వారిపట్ల కృతజ్ఞులై వుండాలి. ఈ చిన్న సమీక్షలో ఈ వ్యాఖ్యలోని వివిధ విశిష్టతలను నిరూపించడం చాలా కష్టం. గ్రంథం ముద్రణ, పొందిక సమగ్రసుందరంగా వున్నాయి".

(ఆంధ్ర పత్రిక)

గీతామకరందం తెలుగుదేశంలో అనన్యసామాన్యమైన ప్రచారం పొందింది. ఈ మహత్తర గ్రంథాన్ని ఆంగ్లభాషలోకి అనువదిస్తే తెలుగు తెలియని జిజ్ఞాసువులకు ఎంతో వుపయోగకరంగా ఉంటుందని భావించిన పెద్దలు కొందరు ఆంగ్లంలోకి ఆ గ్రంథాన్ని అనువదించి ప్రకటించవలసిందిగా శ్రీ స్వాములవారిని ప్రార్థించారు. స్వామీజీ అందుకు సమ్మతించారు. ఆశ్రమనిర్వాహకుల అభ్యర్థన మన్నించి నెల్లూరుకు చెందిన ప్రొఫెసర్ శ్రీ దుర్గా రామమూర్తిగారు గ్రంథాన్ని చక్కగా ఆంగ్లంలోకి అనువదించారు. 1980లో ఆంగ్లానువాదం వెలువడింది. తద్వారా ఆంధ్రేతరులకు కూడా గీతామకరందం ఆస్వాదించే సౌభాగ్యం కలిగింది.

శ్రీ స్వాములవారి గీతావ్యాఖ్యానం లోకప్రియం కావడంవల్ల ధార్మికగ్రంథ ప్రచురణలో శ్రద్ధ చూపుతున్న తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఇటీవల దాన్ని ఇతర భాషల్లో కూడా అనువదింపజేసి ప్రకటించడం మంచిదని భావించారు. స్వాములవారు కూడా అందుకు సంతోషంతో సమ్మతించారు. ఆ కారణంవల్ల తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రస్తుతం గీతామకరందాన్ని హిందీ మొదలైన ఇతర భారతీయభాషల్లోకి అనువదింపజేస్తున్నారు.

ఆశ్రమ కార్యనిర్వహణ

శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపన కాలం నుండీ మేనేజరుగా ఆశ్రమకార్యక్రమాలను నిర్వహిస్తూవచ్చిన శ్రీ బ్రహ్మచారి గోపాల్‌గారు 1964లో ఉన్నత విద్యాభ్యాసానికై ఉత్తరదేశం వెళ్లారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీ ఆదిశేషారెడ్డిగారు తర్వాత కొంతకాలంపాటు ఆశ్రమ కార్యనిర్వహణలో స్వామీజీకి తోడ్పడ్డారు.

1961 లో ప్రొద్దుటూరులో చాతుర్మాస్యవ్రతం జరిగినప్పుడు అక్కడ విద్యార్థిగా వుండిన శ్రీ బి. ఈశ్వర్‌గారు ఆ కార్యక్రమంలో స్వచ్ఛందసేవకులుగా వుంటూ శ్రీస్వాములవారికి గణనీయమైన సేవ చేశారు. తరువాత శ్రీ స్వాములవారితో కూడా శ్రీకాళహస్తికి వచ్చి ఆశ్రమంలోనే వుండి విద్య నభ్యసిస్తూ శ్రీవారికి